క్లుప్తంగా

సామాజిక బాధ్యతగా పేదలకు ఉచిత వైద్యం



ఉచిత వైద్య శిబిరంలో భాగంగా వృద్ధుడిని పరిశీలిస్తున్న డాక్టర్ కృష్ణ

ఏలూరు (టూటౌన్): సామాజిక బాధ్యతగా ప్రతి నెలా పేదలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కృష్ణ తెలిపారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని శ్రీ కృష్ణా ఆస్పత్రి ఆవరణలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను వైద్య వృత్తిలోకి వచ్చి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి నెలా రెండో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 85 రోగులను పరీక్షించి వారికి రక్త పరీక్షలు, బీఎండీ (ఎముకల సాంద్రత), స్కానింగ్, ఎక్స్‌-రే పరీక్షలను ఉచితంగా నిర్వహించామన్నారు. 18 నెలలుగా పేదవారి కోసం ప్రతి నెలా రెండో శనివారం ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, అవసరమైన పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నట్లు డాక్టర్ కృష్ణ తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పలువురు వైద్య సిబ్బంది, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద శిబిరంలో పరీక్షలు



ఆయుర్వేద వైద్య శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యుడు నగేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలోన ఏలూరు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బీవీఎం నగేష్‌తో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ శిబిరంలో 108 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉచిత పరీక్షల అనంతరం వైద్యుడు నగేష్ చికిత్స పొందిన వారికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి నెలా 2వ శనివారం రామకోటి ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని మానేపల్లి రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరస శ్రీనివాస్, బొలిశెట్టి సురేష్ కుమార్, అల్లం వెంకట సుబ్బారావు, చెన్నా వెంకట్రామయ్య పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన సీఎం జగన్

- చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దు
- ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని
- 30వ డివిజన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం





ఏలూరు 30వ డివిజన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, సమావేశానికి హాజరైన పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలు

ఏలూరు టౌన్ : రాష్ట్రంలో చంద్రబాబు ఎన్నికల వేళ మోసపూరిత హామీలు, వాగ్దానాలతో ప్రజలను దారుణంగా మోసం చేసేందుకు మరోసారి కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని, ఆయన మాటలు ప్రజలు ఎవరూ విశ్వసించే పరిస్థితులు లేవని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 30వ డివిజన్ మంచినీళ్లతోటలో రేఖపల్లి నారాయణ ఇంటి వద్ద వైఎస్సార్‌సీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, ముఖ్యకార్యకర్తలతో ముఖాముఖీ నిర్వహించి వారి అభిప్రాయాలను ఆళ్ల నాని తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో విజయానికి అమలు చేయాల్సిన విధానాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చేస్తున్న కుట్రలను ప్రజలంతా గుర్తిస్తున్నారని, అమలు చేయలేని వాగ్దానాలతో ప్రజను మభ్యపెట్టేందుకు ప్రయత్నించినా ఫలితం లేదన్నారు. మొన్నటి వరకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని చంద్రబాబు గగ్గోలు పెట్టాడని, ఇప్పుడు అవే సంక్షేమ పథకాలు అమలు చేస్తానంటూ చెప్పటం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే నాని విమర్శించారు. ప్రజలకు ఏమి చేస్తామో చెప్పుకోలేని స్థితిలో చంద్రబాబు కూటమి ఉందని ఎద్దేవా చేశారు. ఏలూరు నియోజకవర్గంలో అన్ని వర్గాలకు మేలు చేసేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేసిందన్నారు. ఏలూరులో 1.87 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పథకాలు అందించిందని ఎమ్మెల్యే నాని తెలిపారు. సుమారు 26 సంక్షేమ పథకాలకు సంబంధించి రూ.447 కోట్లు సొమ్ములు నేరుగా ప్రజల ఖాతాల్లోకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వేశారని చెప్పారు. ప్రజలకు మరోసారి మంచి జరగాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని, రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, క్లస్టర్-3 పార్టీ అధ్యక్షుడు మంచెం మైబాబు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, నాయకులు బొల్లు హరి, ఎం.పుల్లారావు, బుట్టో, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది రాధారాణి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చని హైకోర్టు న్యాయవాది దేవినేని రాధారాణి స్పష్టం చేశారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్, ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మోటివేషనల్ స్పీచ్ కార్యక్రమంలో ఆమె ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానిని సాధించడం కోసం నిరంతరం సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీ శైలజ, వైస్ ప్రిన్సిపాల్స్ ఎస్. అనురాధ, జీ సరళ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కే. ఝాన్సీలక్ష్మి, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ప్రతినిధులు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు కే. వాణి, ఉపాధ్యక్షురాలు కే. విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొల్లేరు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం



గుడివాకలంకలో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలూరు రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లేరు గ్రామాల ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీకి బ్రహ్మరథం పట్టడం ఖాయమని ఏలూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. గుడివాకలంకలో వైఎస్సార్ సీపీ నాయకులు చేపట్టిన ప్రచారం శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల ప్రచారానికి ప్రజలు ఎదురేగి స్వాగతం పలుకుతున్నారని, దీనికి కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేపట్టిన అభివృద్ధి పనులే అన్నారు. ప్రభుత్వం ప్రతి కొల్లేరు గ్రామంలో కనీసం రూ.50 నుంచి రూ.80 కోట్లు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిందని అన్నారు. రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు చంద్రబాబు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సంక్షేమం, అభివృద్ధి కళ్లకు కనిపిస్తేనే ఓటు వేస్తారన్నారు. హామీలన్నీ అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు నమ్మకాన్ని పెంచుకున్నారని అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల కొల్లేరు గ్రామాల సంఘం నాయకుడు, మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కొల్లేరు గ్రామాల్లో అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ప్రచారంలో వడ్డీ కార్పొరేషన్ డైరక్టర్ మండల కొండలరావు, గుడివాకలంక ఉపసర్పంచ్ రుక్మనంధమహరాజ్, ఎంపీటీసీ మోరు రజని, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బలే బలరామయ్య, ప్రత్తికోళ్లలంక, మొండికోడు, సర్పంచ్‌లు ఘంటసాల మహాలక్ష్మీరాజు, వేజెళ్ల గోపాలకృష్ణంరాజు, బోడిగడ్డ శ్రీను పాల్గొన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం



ఏలూరు 12వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో మాజీ కార్పొరేటర్ రాఘు, సునీల్, జనార్దన్ తదితరులు

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలు గుర్తించాలని, రాష్ట్ర చరిత్రలో ఏనాడు లేనివిధంగా మ్యానిఫెస్టోను 98శాతం అమలు చేసి చూపిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగనన్న మాత్రమేనని, పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు జరగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఏలూరు నగరంలో వైఎస్సార్ సీపీ నేతలు, క్యాడర్ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని విజయాన్ని కాంక్షిస్తూ ప్రతి డివిజన్‌లోనూ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ మరోసారి ఎన్నికల్లో సీఎం జగనన్నను ఆశీర్వదించాలని కోరుతున్నారు.

6వ డివిజన్‌లో..

ఏలూరు నగరంలోని 6వ డివిజన్‌లో క్లస్టర్-1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఏలూరులోని చాటపర్రు రోడ్డులో నేను సిద్ధం, మా ఊరు సిద్ధం పర్యటించి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానితోనే ఏలూరు నగరంలో ప్రజలకు మేలు జరుగుతుందని, ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

12వ డివిజన్‌లో ప్రచారం

ఏలూరు 12వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ కాపా రఘు, మార్కండేయ స్వామి గుడి కమిటీ నాయకులు జనార్దన్, ఎస్సీ సెల్ నగర వైస్ ప్రెసిడెంట్ బండ్లమూడి సునీల్‌కుమార్ తదితర పార్టీ క్యాడర్ అంతా డివిజన్‌లోని ఎస్సీ కాలనీ, ముస్లిం మైనార్టీల ప్రాంతంలో గడపగడపకూ వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శి ఇరదల నాని, కరీం, ఏసురత్నం, స్వామిదాసు, పట్నాల విజయకుమార్ ఉన్నారు.

ఏలూరు 9వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏలూరు ఎమ్మెల్యే నాని విజయానికి ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఏలూరు ఎంపీ కారుమూరి సునీల్‌కుమార్‌కు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానికి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఘన విజయం అందించాలని కోరారు.



ఏలూరు 6వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న క్లస్టర్-1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్



ఏలూరు 9వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్, పార్టీ నేతలు

సీఎం జగన్‌పై దాడి హేయమైన చర్య

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాలకు ఆశాజ్యోతిలా, మహిళలకు ఇంటికి పెద్దన్నలా, వృద్ధులకు అండగా, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకునిలా, సంక్షేమ, అభివృద్ధి రథసారధిలా అన్ని వర్గాలకు భరోసాగా నిలుస్తూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బస్సు యాత్ర చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పచ్చబ్యాచ్ దాడికి పాల్పడటంపై వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల వేళ చంద్రబాబు, పచ్చ బ్యాచ్ చేస్తున్న నీచమైన, కుటిల రాజకీయాలపై ప్రజల్లోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. తాజాగా విజయవాడలో బస్సు యాత్రలో భాగంగా రోడ్డు షో చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ రాళ్లతో దాడి చేయించటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాటాకు చప్పుళ్లకు భయపడం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు ప్రజల్లో వస్తున్న మార్పును చూసి తట్టుకోలేని దుష్టచతుష్టయం దాడులకు తెగబడుతున్నారు. టీడీపీ కూటమి చేస్తున్న తాటాకు చప్పుళ్లకు భయపడేదిలేదు. ఎన్నికలు సమీపించడంతో రోజు రోజుకూ జగన్‌కు ప్రజల్లో వస్తోన్న ఆదరణ చూసి చంద్రబాబుకు భయం పట్టుకుందని, కుట్రలు చేసి బస్సు యాత్రను ఆపాలనే నీచమైన రాజకీయాలు చేస్తున్నారు. మహిళలంతా సీఎం జగనన్న వెంటే ఉన్నారు.

– పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్

బీసీలంతా సీఎం జగన్‌తోనే

రాష్ట్రంలోని బీసీ వర్గాలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉన్నాయి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమికి ఓటమి ఖాయం. సీఎం జగన్ బస్సు యాత్రను చూస్తే టీడీపీ కూటమి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రాష్ట్రంలో బీసీలకు దన్నుగా నిలుస్తూ రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం జగన్‌కు బీసీ వర్గాలు అండగా ఉంటారు.

– బొద్దాని శ్రీనివాస్, ఇడా చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు

టీడీపీ ఓటమి ఖాయం

రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమికి చావుదెబ్బ ఖాయం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రను అడ్డుకునేందుకు రాళ్ల దాడి చేయటం హేయమైన చర్య. దమ్ముగా రాజకీయాల్లో ఎదుర్కోలేక నిస్సహాయ స్థితిలో చంద్రబాబు, పచ్చబ్యాచ్ ఇలా పిరికిపందల్లా దాడులకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలంతా సీఎం జగనన్నకు తోడుగా ఉంటారు. ఆయనపై దాడులకు తెగబడితే టీడీపీ, జనసేన, బీజేపీ నేతలను రోడ్లపై తిరగనివ్వం.

– మున్నుల జాన్‌గురునాథ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి

సీఎం జగనన్నపై దాడి దారుణం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దుండగులు దాడి చేయటం సిగ్గుచేటు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరుగుతుంటే, ప్రజా క్షేత్రంలో ప్రజల మనస్సులను గెలిచేలా ప్రయత్నించాలి తప్ప ఇలా సాక్షాత్తు ముఖ్యమంత్రిపై దాడి చేయటం దారుణం. ప్రతిపక్షాల్లో నెలకొన్న భయానికి ఇది నిదర్శనం. జగనన్న బస్సు యాత్రకు ప్రజల్లో వస్తోన్న అనూహ్య స్పందన చూస్తే టీడీపీ కూటమికి కడుపుమంటగా ఉంది. తట్టుకోలేక నీచంగా దాడులకు పాల్పడుతున్నారు. ముస్లిం మైనార్టీలంతా జగనన్నతోనే ఉన్నారు.

– ఎస్కే రియాజ్ అలీఖాన్, ముస్లిం మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు

కొల్లేరు గ్రామాల్లో వలంటీర్ల రాజీనామా



కార్యదర్శి ప్రసాద్‌కు రాజీనామా పత్రాలు అందిస్తున్న మొండికోడు, గుడివాకలంక వలంటీర్లు

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామాల వలంటీర్ల రాజీనామా పర్వం శనివారం కొనసాగింది. ఏలూరు రూరల్ మండలం మొండికోడు, గుడివాకలంక గ్రామానికి చెందిన మరికొంత మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఏలూరులోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శికి ప్రసాద్‌కు వారు రాజీనామా పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ల పనితీరుపై ప్రతిపక్ష నాయకులు ప్రచారం చేస్తున్న అనుమానాలు, సత్యశోధన భరించలేమన్నారు. నిజాయతీతో ప్రజలకు సేవ చేస్తున్నప్పటికీ టీడీపీ, జనసేన నాయకులు వలంటీర్లపై చేస్తున్న అసత్య ప్రచారం మానసిక ఆవేదనకు గురి చేసిందన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి కరోనా కష్టకాలంలో ప్రజలకు చేసిన సేవను సైతం నాయకులు మరిచిపోయారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విధులు నిర్వహించలేమని, గత్యంతరం లేక వలంటీర్ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

16న కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ మంగళవారం కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గండికోట రాజేష్, కోశాధికారి కొచ్చర్లకోట వెంకట సుబ్బారావు తెలిపారు. 16న సాయంత్రం 6 గంటలకు స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించే ఈ సమ్మేళనంలో భాగంగా తొలుత నాట్యాచార్య గండికోట రాజేష్ సమర్పణలో జాహ్నవి లాలిత్య బృందం ఆధ్వర్యంలో స్వాగత కూచిపూడి నృత్యాలు, కలకుర్రుకు చెందిన మారుతీ యువకళా నాట్యమండలి కళాకారుల ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర (వారణాసి దృశ్యాన్ని) ప్రదర్శిస్తారన్నారు. నగరానికి చెందిన గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో కళా రంగానికి విశిష్టమైన సేవలందించి, ఆర్థికంగా వెనుకబడిన కళాకారును సత్కరించడంలో భాగంగా తబలా కళాకారుడు సీహెచ్ కళ్యాణ్, గాయకులు బగ్గం చంద్రమౌళి, పౌరాణిన నటులు సరిపల్లి సౌరి సత్యనారాయణ, పౌరాణిక నటీమణి సీబీ కల్యాణిని ఆర్థికంగా సత్కరిస్తామన్నారు. రంగస్థల పౌరాణిక నటుడు కడియాల విజయ భాస్కర్, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి అప్పారావుకు గౌరవ సత్కారం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా కళారత్న కేవీ సత్యనారాయణ, గౌరవ అతిథులుగా యర్రా సోమలింగేశ్వరరావు, లంకా వెంకటేశ్వర్లు, పైడి భీమేశ్వరరావు, పుల్లాభొట్ల పురుషోత్తం పాల్గొంటారని తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్‌పేట సెక్షన్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం, వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 15వ తేదీ సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. నగరంలోని వెంకన్న చెరువు 11 కేవీ ఫీడర్, పవర్‌పేట 11 కేవీ ఫీడర్, రామకృష్ణాపురం 11 కేవీ ఫీడర్, పోణంగి 11 కేవీ ఫీడర్, గ్రీన్ సిటీ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ఫీడర్ల పరిధిలోని పడమర వీధి, పాత బస్టాండు, వసంతమహల్ సెంటర్, రామకృష్ణాపురం, గ్రీన్ సిటీ, హనుమాన్ నగర్, గొల్లాయగూడెం, గులాబి తోట, నెహ్రూ కాలనీ, కొబ్బరితోట, వంగాయగూడెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఈపీడీసీఎల్ ఏలూరు నార్త్ సెక్షన్ పరిధిలో సంతోష్‌నగర్ 33 కేవీ ఫీడర్ మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఈ నెల 15వ తేదీ సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఈ మేరకు నగరంలోని రామచంద్రరావు పేట, పత్తేబాద నాలుగు గుడుల సెంటర్, అతిథి హోటల్ రోడ్డు, శంకర మఠం ప్రాంతం, పవర్ పేట ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

కొత్తూరు జూట్ మిల్లును తెరవాలి




నిరసన వ్యక్తం చేస్తున్న ఇఫ్టూ అనుబంధ సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): చట్ట విరుద్ధంగా మూసివేసిన కొత్తూరు జూట్ మిల్లును తెరిపించాలని కోరుతూ ఇఫ్టూ అనుబంధ సంఘాలు, ఏలూరు జట్టు కార్మిక సంఘం, హమాలీ ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్‌ఏ సెంటర్‌లో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇఫ్టూ ఏలూరు నగర సహాయ కార్యదర్శి మంగం అప్పారావు, ఉపాధ్యక్షుడు దూళ్ళ వీరినాయుడు మాట్లాడారు. ఈనెల 8న మూసివేసిన కొత్తూరు జూట్ మిల్లును తెలిరిపించాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. 2,500 మంది పనిచేస్తున్న కొత్తూరు జూట్ మిల్లు ఏలూరుకు పెద్ద పరిశ్రమ అని అన్నారు. దీన్ని మూసివేయడం వల్ల కార్మిక వర్గం ఉపాధికి నష్టం కలిగించేదిగా ఉందని అన్నారు. దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి మిల్లును తిప్పే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఈశ్వరరావు, అన్నవరం, నారాయణ, వలపు శ్రీనివాసరావు, గోకర్ల రంగారావు, నాయుడు వీరభద్రం, లంక లోవా, పల్లెలు నాయుడు, కర్రే దేవుళ్లు, బి.కృష్ణ, సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభం

భీమడోలు : భీమడోలు అగ్నిమాపక కేంద్రం వద్ద ఈనెల 14 నుంచి 20 వరకూ జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అగ్నిమాపక కేంద్రం అధికారి జి.నాగరాజు శనివారం రాత్రి విలేకరులకు తెలిపారు. భీమడోలులోని ఫైర్ స్టేషన్ వద్ద ఆదివారం ఉదయం 8.30 గంటలకు జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తామని తెలిపారు అగ్నిమాపక వారోత్సవాల్లో అగ్ని ప్రమాదాలు వాటి నివారణ తదితర అంశాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనలు కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐచ్ఛిక ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
✆ 99122 20559
95055 08399
96408 32693
Office mail : tpgadvt@gmail.com